# కోటేసు

అదొక చిన్న రైల్వేస్టేషన్. పాసింజరు బళ్ళుతప్ప ఇతర రైళ్ళు అక్కడ ఆగవు. దగ్గరలో బస్‌రోడ్డు లేకపోవడం వల్ల ఆ చుట్టు ప్రక్కల గ్రామాలకు ఆ స్టేషనే గతి. ఆ స్టేషన్‌లో వెయిటింగ్ రూం అని పిలవబడే ఒక వరండా వుంది. వాన కురుస్తే ఆ వరండా నిరుపయోగమే. వరండాలో కొంచెం పొడిగావున్న ఓ మూలకు చేరుకొన్నారు పాసింజెర్లు.

పైట కొంగులను కప్పుకొని ఒద్దికగా కూర్చున్నారు ఆడవాళ్ళు. తువ్వాళ్ళను భుజాలమీద కప్పుకొని కూర్చున్నారు పాసింజెర్లు. పాసింజెర్స్ తిని పారేసిన అరటి, సపోటాపళ్ళ తొక్కల మీద ఈగలు ముసురుకున్నాయి. రెండు కుక్కలు ఒక మేక కూడా వరండాలోనే తల దాచుకున్నాయి.

మసాలా గారెలూ, పకోడీలు సజ్జలో వేసుకొని వచ్చాడు కోటేసు. సామాన్లు తడవకుండా సజ్జకు పోలితిన్ కాగితాన్ని చుట్టాడు. తాను తడిసినా పరవాలేదు. సామాన్లు మాత్రం తడవకూడదు.

వెయిటింగ్ హాల్లోకి ప్రవేశించిన కోటేసుకి పాసింజర్లను చూసాక ఉత్సాహం పుంజుకొచ్చింది. "కోచీ వచ్చేలోగా ఈ సామానయిపోతే మరో సజ్జతో తెచ్చుకోవచ్చు" అనుకున్నాడు.

కోటేసుకి పధ్నాలుగేళ్ళు. తండ్రి గంగన్న రైలుబళ్ళలో తిరిగి సామాన్లు అమ్ముతుండేవాడు. పదిహేను సంవత్సరాలు తిరిగాడు. కదులుతూన్న ట్రైను ఎక్కబోయి చేయి జారిపడ్డాడు. ఒక కాలుతెగి పోయింది. అవిటివాడైపోయాడు. అప్పటికి కోటేసుకి పదేళ్ళు. ఇంట్లో పెళ్ళాంచేత సామాన్లు చేయించి కోటేసుచేత సామాన్లు అమ్మించేవాడు మొదట్లో. కొన్నాళ్ళకు తండ్రిలా బండిలో తిరగడం ప్రారంభించాడు. కోటేసు సంపాదనే ఆ కుటుంబనికి ఆధారం.

ఆ స్టేషనుకు తరచుగా వచ్చే పాసింజెర్లతో పరిచయం వుంది కోటేసుకి. గోడకానుకొని తువ్వాలు కప్పుకొని పొందికగా కూర్చుని వున్న రామయ్యతాతను మొట్టమొదటిసారిగా పలకరించాడు.

"ఏటి తాతా చలట్టుకొని పోయావేటి?"

తాత మాట్లాడలేదు నవ్వు మొహం పెట్టి అవునన్నట్లుగా తలూపాడు.

"వేడి వేడి గార్లూ పకోడీలూ వున్నాయ్ తాతా! ఇప్పుడే యేసాం!" సజ్జలో వున్నపొట్లాన్ని సర్ధుతూ చెప్పాడు కోటేసు.

తాతకి నోరూరింది.

"సిల్లర్లేదురా కోటేసు! రెండ్రూపాయిల కాయితంవుంది!" అన్నాడు.

"నీ కాడ్డబ్బులెక్కడికి పోతాయ్ తాతా! సంతనుంచి తిరిగొచ్చినప్పుడు ఇద్దువుగానిలే! వేడేడిగున్నాయ్ చలట్టుకు పోనావ్!" అంటూ ఒక పొట్లాన్ని ఎంచి తీసి అందించాడు కోటేసు.

"నిజంగానే ఏడిగున్నాయిరా!" అన్నాడు తాత పొట్లాం అందుకొని.

పాసింజెర్ల నాడి బాగా తెల్సు కోటేసుకి. ఒక్క పాసింజెరు కొంటే మిగతావారు కొంటారు. అది వారి మనస్తత్వం. తాత పకోడీని నోట్లో వేసుకోగానే అడిగాడు అందరికి వినిపించేలా.

"ఎలాగున్నాయ్ తాతా?"

"భలేగున్నాయిరా కోటేసు! పకోడీ వేస్తే మీయమ్మే ఎయ్యాలిరా!" మెచ్చుకున్నాడు.

"మరేటనుకొన్నావ్! ఈ ముసుర్లో ఏడేడి గార్లూ పకోడీలూ తినాలి! ఈ మూాడ్రోలుబట్టీ పకోడీలూ, గారెలు సెల్లిపోతున్నాయనుకో!" అన్నాడు మిగతా పాసంజర్లు నోరూరించాలని.

ఒక ఐదేళ్ళ అమ్మాయి పకోడీలు కొనమని తల్లిని వేధించడం కోటేసు గమనించాడు.

"తీసుకో పిన్నమ్మా! బాగుంటేనే డబ్బులియ్యి! పొట్లాం పావలా!" హుషారుగా ఓ పొట్లాం తీసి అందించాడు. పిల్ల అందుకొంది సంబరపడ్తూ. ఆ తర్వాత పాసింజర్లు ఒకరు ఒకరూ కొనడం ప్రారంభించారు. పకోడీల పొట్లాలన్నీ అమ్ముడైపోయాయ్. ఆ తర్వాత గారెలు తీసాడు. అవి కూడా చాలా మట్టుకి చెల్లిపోయాయ్. గోడకున్న మేకుకు సజ్జను తగిలించి వారగా కూర్చున్నాడు. ఒక కుక్క తోకాడిస్తూ అతని కెదురుగా నిలబడింది.

"ఈ ముసురింకా ఎన్నాళ్ళుంటాది బాబూ!" ఫాంటూ చొక్కా వేసుకొని కూర్చుంటే బట్టలు నలిగిపోతాయేమోనన్న భయంతో నిలబడి చలికి వణికిపోతూన్నా ఓ యువకుణ్ణి అడిగాడు తాత.

"నిన్నటితో సరి అని రేడియోలో చెప్పాడు!" చెప్పాడా యువకుడు చికాగ్గా.

"మేగాలిడిపోతున్నాయ్ మద్దేనానికి తెరిపిస్తాది." తాతే అన్నాడు.

యువకుడు కామెంట్ చేయలేదు.

"కోచీ లేటేట్రా కోటేసు?" అడిగాడు తాత.

"అఁ అరగంటలో వస్తుందని గంటన్నర క్రితం చెప్పాడు ఏఎస్సెమ్" విసుగు విసుర్తూ చెప్పాడా యువకుడు. వేళాకోళం ధ్వనించిందతని మాటల్లో.

కాలక్షేపం కోసం పాసింజెర్ల హాల్లోకి వచ్చాడు నర్సింహులు. తిన్నగా గోడకి తగిలించి వున్న సజ్జవైపుకు వెళ్తూంటే అడిగాడు కోటేసు.

"వచ్చేది గూడ్సు బండేటి మావా?"

"కాదురా! సమ్మర్ స్పెషల్! సామానంతా అయిపోయినట్టుందే!

నాలుగ్గార్లు తీసుకొన్నా!" అంటూ తన చేతిలోని గారెలు చూపించాడు నర్సింహులు.

కోటేసు మాట్లాడలేదు. వాడి బాకీ ఎంతయిందీ లెక్కకడ్తున్నాడు.

"ఈ ముసురుకాదుగానీ బళ్ళన్నీ లేటుగా వస్తున్నాయిరా కోటేసు! గోదావరి పొంగి పారుతోందంట! బ్రిడ్జీమీద బళ్ళన్నీ నత్తనడకలు నడుత్తున్నాయ్!" అంటూ

గారెను నోట్లో వేసుకొని.

"ఏట్రా కోటేసు గార్లు మరీ బిండొడియాల్లా తయారు సేత్తున్నారు?" అడిగారు నర్సింహులు.

"నీకు తెల్దేటి మావా! నూనీ సెనగపప్పు ఎంత ధరతో వుందో! పదిపైసలకి ఎంతగారొత్తాది!" అన్నాడు కోటేసు జవాబుగా.

వాటి సమాధానం వినకుండానే అక్కణ్నుంచి జారుకున్నాడు నర్సింహులు. జేబులోంచి డబ్బుని బయటకి తీసి లెక్క పెట్టుకున్నాడు కోటేసు. "అమ్మకం పదహార్రూపాయల పావాలా!" అనుకున్నాడు. గారెలు మాత్రం కొంచెం మిగిలాయ్. "కోచీ వచ్చేలోగా యింటికెళ్ళి సజ్జ నింపుకొని రావాలనుకున్నాడు. లేచి సజ్జను బుజానికి తగుల్చుకొని యింటికి బయలుదేరాడు. స్టేషన్‌కి యెదురుగా పాతిక ముప్పై కొంపలున్నాయ్. అక్కడనే వాడి నివాసం. ఆలోచనలతో అడుగులు వేయసాగాడు.

తనకు పోటీగా చిట్టెమ్మ కొడుకు మరిడయ్య కూడా అమ్ముతూంటాడు. వాడికి వారం రోజుల నుంచీ జ్వరం. అందుచేతనే ఈ వారం రోజులూ తనకి బేరం బావుంది. సావుకారి పాతబాకీ తల్లి దండ్రులకి తెలీకుండా పదిరూపాయలు జమ కట్టాడు. తాను తొడుక్కున్న చొక్కా నిక్కరూ ప్రెసిడెంటు గారబ్బాయి అరువిప్పిస్తే కొనుకొన్నాడు. పదిహేను రూపాయలయ్యాయి. ఆ ర్రూపాయిలు జమ కట్టాడు. ఎవరికీ తెలీకుండా ఏ ఎస్సెమ్ గారి భార్య దగ్గర దాచుకొన్న పదిరూపాయిలకీ మరో ఐదు రూపాయిలు కలిపి పండక్కి తల్లికి కోక కొనాలి! తాను ఆ డబ్బు దాచినట్లు తండ్రికి తెలిస్తే లాక్కొని పట్టుకెళ్ళి తాగేస్తాడు. సంపాదన లేకపోయినా తాగుడు మాత్రం మానడు. ఊహల్లో తేలిపోతూ యిల్లు చేరాడు. కొడుకు వెంటనే తిరిగిరావడం చూసి ఆశ్చర్యపోయింది. కోటేసు తల్లి ఆదెమ్మ.

"ఏట్రా అప్పుడే తిరగొచ్చేసి నావు! పాసింజెర్లు లేరా! యియ్యాల సంతగదా!"

"సరుకంతా అయిపోయిందమ్మా! సజ్జ నింపుకొని ఎళ్దామని వచ్చా!" చెప్పాడు సజ్జని కిందపెడ్తూ.

చేటంత మోహం చేసుకొంది ఆదెమ్మ. కాళి సజ్జను పొయ్యి దగ్గరికి

తీసుకెళ్ళి పకోడీ పొట్లాల్లోనూ, గారెల్తోనూ నింపింది. సజ్జను కొడుక్కు అందిస్తూ....

"పకోడీలు ఐదు చేతుళ్ళు, గార్లు ఎనిమిది చేతుళ్ళు" అంది.

నులక మంచం మీద కూర్చున్న కోటేసు తండ్రి గంగన్న "అయిపోగానే బేగిరా! శనక్కాయలు యేపించి వుంచుతా!" మాటలు ముద్దగా వచ్చాయ్.

తండ్రి వైపు ఈసడింపుగా చూసాడు కోటేసు. సజ్జను భుజానికి తగిలించుకొని స్టేషనుకి బయలుదేరాడు. దూరంగా ఔటరు సిగ్నలు దగ్గర మలుపు తిరుగుతూ పొడవుగా త్రాచుపాములా బుసలుకొట్టు కొంటూ పెద్ద స్పీడులో వస్తోంది సమ్మర్ స్పెషల్. క్రమేపీ వేగం తగ్గి స్టేషన్‌లో ఆగింది.

ముందున్న కేబిన్ వైపూ సిగ్నలు వైపూ చూసాడు. సిగ్నలు యివ్వబడలేదు. అందుకనే అగింది అని నిర్ధారించుకొన్నాడు. అనుకోని బేరం తగిలినందుకు సంబరపడ్తూ గబగబా పరుగెత్తి బండిని చేరుకొన్నాడు.

ఒక పెట్టెలో చొరబడి అమ్మకం ప్రారంభించాడు. ఐదు నిముషాల్లో సజ్జ కాళీ అయింది సజ్జ తేలికయింది. జేబు బరువెక్కింది. పావలా పొట్లాన్ని ముప్పైపైసలకి. పది పైసల గారెలను పదిహేను పైసల చొప్పునా అమ్మేసాడు. తన అదృష్టానికి సంబరపడ్తూ కంపార్టు మెంటు దిగాడు. ఇంకావుంటే అమ్మేసు కొందును అనుకున్నాడు.

"సరుకైపోయిందేట్రా?" కేకేసాడు నర్సింహులు. వాడి ప్రశ్నకు సమాధానం యివ్వకుండా, "ఏటి మావా ఈ బండిక్కణ్ణే ఆగిపోయింది?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ముందెళ్ళిన గూడ్సు బండింకా అవతలి స్టేషన్ చేరుకోలేదురా! ఎళ్ళి సానాసేప..."

స్టేషన్ మాష్టారు గట్టిగా కేకేసి పిలవడంతో మాటల్ని మధ్యలోనే ఆపేసి అటువైపు పరుగెత్తాడు నర్సింహులు. స్టేషన్ మాష్టారు చాలా కంగారుగా కనబడ్డంతో కోటేసు కూడా స్టేషన్ మాష్టారు గది వైపు వెళ్ళాడు

స్టేషన్ మాష్టారు గాబరాగా ఫోనులో ఇంగ్లీషులో మాట్లాడ్తున్నారు. కోటేసుకి అర్థంగాక పోయినా ఏదో ప్రమాదం జరిగిందని గ్రహించాడు. నర్సింహులు

బయటకు రాగానే అడిగాడు. "ఏటి మావా జరిగింది?" అని.

నర్శింహులు సమాధానం చెప్పలేదు. స్పెషల్ ట్రైను డ్రైవరు దగ్గరకి పరుగెత్తుకెళ్ళాడు.

బండిలోని పాసింజర్లు ఒక్కొక్కరూ దిగారు. ఏం జరిగిందో! బండి ఎందుకాగిందో తెలుసుకోవాలన్న కుతూహలంతో స్టేషన్ గదిలో చొరబడ్డారు. ఆఖరికి అసలు విషయం తెలుసుకొన్నాడు కోటేసు. ముందు వెళ్ళిన గూడ్సు బండి తాలూకు నాలుగు బోగీలు పట్టాలుతప్పి పడిపోయాయి. దార్లో ఆగిపోయిందా బండి. నర్శింహులును కలుసుకున్నాడు కోటేసు.

"అయితే ఈ బండింకా ఎంత సేపుంటోంది మావా?" అడిగాడు.

విసుగ్గావున్నా జవాబు చెప్పేడు నర్శింహులు.

"ఎంత సేపేట్రా! రాజమండ్రీ నుంచో వాల్తేరు నుంచో క్రేన్‌రావాలి! బోగీల్నెత్తాలంటే నాలుగైదు గంటలు పట్టవచ్చు".

ఇంకా ఏదో అడగాలను కొన్నాడు కోటేసు. అవకాశం ఇవ్వలేదు నర్శింహులు.

"అయితే ఈ బండి కదిలేసరికి నాలుగ్గంటలన్నా పడతాదన్న మాట. ఈలోగా తాను పకోడీలూ, గార్లూ ఏయించి తెచ్చుకుంటే పాసింజర్లు ఆకలిమీద నున్నట్టున్నారు. పెద్ద బేరమే! ఉప్మాకూడా చేయించొచ్చు చిటికెలో ఎగిరిపోతాయి. నెల్లాళ్ళ అమ్మకం నాలుగంటల్లో చెయ్యవచ్చు" అనుకొని ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా ఇంటి దగ్గరకు పరుగెత్తాడు కోటేసు. సంగతి తెలుసుకుని మొదట సంతోషించినా తర్వాత తెల్లమొహం వేసింది కోటేసు తల్లి ఆదెమ్మ.

"సావుకారికి సానా బాకీ వున్నాంరా! ఆడింకరువీయడు" అంది నిరాశగా.

"నీకెందుకమ్మా నేతెస్తాగా" అంటూ సిల్వర్ పళ్ళెమూ, సంచీ, నూనె డబ్బా తీసుకొని బయల్దేరాడు కోటేసు.

కోటేసు చెప్పిన సామాన్లను చీటిమీద రాసాడు షావుకారు. వాటి ఖరీదు టోటల్ చేసి, "డబ్బెంత తెచ్చావ్!" అడిగాడు.

"నా దగ్గరీరోజు అమ్మకం ముప్పైఆరు రూపాయలున్నాయి తీసుకొండి. మిగతా సొమ్ము స్పెషల్ ట్రైనెళ్ళగానే తెచ్చి జమకడతాను" అంటూ జేబులోంచి రూపాయి కాగితాల్నీ చిల్లర డబ్బులను బయటకు తీశాడు కోటేసు. రాసిన చీటిని కోటేసుముందు పడేసాడు శెట్టి నిర్లక్ష్యంగా.

"ఈ సామానుకెంతయిందో తెల్సా?" అడిగాడు.

"సానా అవుద్ది! తమరు దయసూపాలి" ప్రాధేయపడ్డాడు కోటేసు.

"ఎనభైరూపాయల ఆరణాలైంది పాత బాకీ రెండొందల పాతికుంది. అర్నెల్లబట్టీ జమలేదు. ఇప్పుడు మళ్ళీ అరువట్రా సిగ్గు లేదూ" చీదరించుకున్నాడు శెట్టి.

"కనికరించాలి శెట్టిగారూ! అవతల స్పెషల్ ట్రైనాగిపోయింది. సరుకులర్జంటుగా కావాలి మీరు ఇప్పుడరువియ్యకపోయే సానా పెద్దబేరం పోద్ది. బండెళ్ళగానే నూటపాతిక రూపాయిలు జమకడతా! తమరు సాయం చేయాలి" బ్రతిమలాడాడు.

ఆలోచనలోపడ్డాడు శెట్టి.

కోటేసులో ఆశ చివురించింది.

"ఒరేయ్! తల్లీ తండ్రిపోయినా బతకొచ్చుగానీ పరపతిపోతే బ్రతకలేంరా! మీనాన్న మొహం చూస్తే అరువియ్యబుద్దేయదురా."

"మీకనుమానంగుంటే బండి కాడకొచ్చి వసూలు సేసుకోండి" దీనంగా అన్నాడు.

"నీమీద నమ్మకం లేక కాదురా! నీలో నిజాయితీ వుందని నాకు తెలుసు. కానీ నీ బాబు నీ మాట పడనిస్తాడ్రా? అదీగాక ఈరోజు సంతగదా? సంతనుండి బండి రావాలి సామాన్లు లేవు.

శెట్టిగారి మాటలకు విలవిల్లాడి పోయాడు కోటేసు. నిస్పృహ చెందినా పట్టువదల్లేదు.

"అలా అనకండి శెట్టిగారూ! తమరు కూడా టేషన్‌కి రండి. అక్కడ్నే ఇచ్చేస్తా పెద్ద బేరం పోద్ది" నా మీదొట్టు ఇయ్యకపోతే నా రక్తం కళ్ళ జూడండి!" తన నెత్తి మీద చెయ్యి పెట్టుకున్నాడు కోటేసు.

కోటేసు కళ్ళు చెమ్మగిల్లడం గమనించాడు శెట్టి. వాడికరువిస్తే పాత బాకీ కొంత జమవుతుంది. "అంత మాటనకురా కోటేసు! నువ్ చల్లగుండాల! నాయాపారం బాగుండాల!"

శెట్టి మాటలకి ధైర్యంవచ్చింది కోటేసుకి.

కోటేసు తండ్రి గంగన్నకి మత్తు దిగజారింది. స్టేషన్‌వైపు చూసాడు. ఎదురుగా సమ్మర్ స్పెషన్ పెన్నిధిలా కనబడింది. ఆశగా చూశాడు. 'పెద్ద బేరమే' అనుకొన్నాడు. చిట్టెమ్మ కొడుకు మరిదయ్య జొరంతో తొంగున్నాడు! కనక ఆ బేరం అంతా తమదే! ఎనభై రూపాయలు తెచ్చి అమ్మితే రెండొందలైనా వస్తాయ్. తన జీవితంలో పదిహేనేళ్ళ క్రితం ఇలాంటి బేరమే తగిలింది. పోటీదార్లెక్కువగా వుండటంవల్ల పెద్దగా లాభించలేదు! అయినా బాగా అమ్ముకొన్నాడు. తాను కూడా కోటేసుతో బండి దగ్గర కెళ్ళి ఆడికి సాయపడాలి? ఐదో, పదో సంపాదించాలి! తనివి తీరా తాగాలి! గ్లాసు మీది గ్లాసేసుకుని చాలా కాలమైంది!"

" ఆ బండియేపే అలా సూత్తూ మురిసిపోతే ఎలాగయ్యా? అలా మావిడి తోటలోకెళ్ళి నాలుగు పుల్లలేరుకొని పట్రా?"

మొగుణ్ణి అదిలించింది ఆదెమ్మ.

మొగుడు కదలగానే ఆ బండి వైపే చూస్తూ నిలబడింది ఆదెమ్మ. "కోటేసు శానా అదృష్టవంతుడు! అడి అయాంలోనే సుఖం గుంది! పొద్దుటే లేవగానే ఎవడి మొహం సూసానో! ఇంకెవడు కోటేసే! అడే తెల్లారు జావున లేచి రోజూ నిద్దల్లేపుతాడు! ఎంతో పొదుపరితనం వుందాడిలో! తండ్రికి తెలీకుండానే డబ్బు దాచి ఏడాదికి రెండు కోకలు కొంటున్నాడు. రెండుపూట్ల తింటున్నాం.

ఈ బేరంలో సానా డబ్బు మిగులుద్ది కోటేసుతో టౌనుకెళ్ళి మంచి సవరం కొనుక్కోవాలి! రయికలు చిరిగి పోయాయ్ రెండన్నా కుట్టించుకోవాలి! సావుకారి

పాత బాకీ పాతికో ముప్పయ్యో జమకట్టాలి! గంగన్న చేతిలో పైసలు పడకుండా సూడాల. నేను కూడా బండి దగ్గరకెళ్తా! టిఫునుతోబాటు యేడేడి టీ కూడా పెడ్తే బేరం బావుంటాది" అనుకొంది ఆదెమ్మ. పాలకోసం నాయుడుగారింటికి బయలుదేరింది.

సావుకారిచ్చిన సామాన్లు బుజాన వేసుకొని బయలు దేరాడు కోటేసు. స్పెషల్ ట్రైన్ ఎదురుగా కన్పిస్తోంది. పట్నం నుండి పుగాకు తెచ్చి తండ్రి చేత చుట్టలు చుట్టించి అమ్మించాల! అందులో లాబం బావుంటాది! తన బట్టల బాకీ తీర్చాలి! తల్లికి పట్నం నుంచి కోక కొని తేవాల! సావుకారి బాకీలో యాభై ఐదు జమకట్టాలి. అతను సానా మంచోడు."

ఆదెమ్మ పాలగిన్నెతో యింటి కొచ్చేసరికి కొడుకు సామాన్లు పొట్లాలు విప్పి పళ్ళెంలో పోస్తున్నాడు. అప్పటికే ఉల్లిపాయలూ, పచ్చి మిరపకాయలూ తరిగి వుంచాడు. కట్టెల మోపు బుజాన వేసుకొని కుంటుకుంటూ వచ్చాడు గంగన్న.

"ప్లాటుపారం మీదే రాళ్ళతో పొయ్యేట్టి సామాన్లు చేద్దాం! వేడి గుంటే పాసింజర్లెగేసి కొంటారు!" సలహా యిచ్చాడు గంగన్న. గంగన్న సూచన నచ్చింది ఆ తల్లీ కొడుకులకి!

ప్లాట్‌ఫారం మీదనే చిన్న కాఫీకొట్టు వెలసింది. పూరీలూ, పకోడీలూ, ఉప్మా టీ తయారు చేసారు. పాసింజర్లు ఒక్కొక్కరూ బండి దిగి కొనుక్కోవడం ప్రారంభించారు.

"కోటేసు సామాన్లు మేం అందిస్తాంగానీ డబ్బు లెక్కజూసి నువ్వే తీసుకో!" అంది ఆదెమ్మ. మొగుడు ఎక్కడ డబ్బు వసూలు చేస్తాడన్న బెంగతో. తల్లీ తండ్రీ టిపినూ టీ అందిస్తూంటే కోటేసు డబ్బు వసూలు చేస్తున్నాడు. అరగంటలో చాలా బిజీ అయిపోయారు ముగ్గురూ.

అలా రెండు గంటలసేపు సాగింది బేరం. ఆ తర్వాత పాసింజర్లు రావడం తగ్గింది. ఫాంటు జేబులు తడుముకొన్నాడు కోటేసు. ఒక జేబునిండా నోట్లు! రెండో జేబులో చిల్లర! చాలా బరువుగా వుంది. ఒకసారి బండి వైపు చూసాడు ప్లాట్‌ఫారం

మీదున్న చెట్లు నీడలో కూర్చుని కొంతమంది పాసింజర్లు విశ్రాంతి తీసుకొంటున్నారు. సిల్వరు పళ్ళెంలో కొంచెం పకోడీలూ, గారెలూ మిగిలాయ్. బండి దగ్గరకెళ్ళి వాటిని కూడా అమ్మేయాలనుకున్నాడు.

అయ్యా! పకోడీలు పొట్లాలు గట్టు! బండిలోకెళ్ళి అమ్మేస్తా! పాసింజర్లు రారింక!" అన్నాడు తండ్రితో. తల్లీ తండ్రి గబగబా పొట్లాలు కట్టారు. సజ్జలో వేసుకొని బండి దగ్గరికి బయలు దేరాడు.

అంతలో ప్లాట్‌ఫారం మీది కొచ్చాడు సావుకారు. ఆదెమ్మనీ గంగన్ననీ పలకరించాడు.

"ఆదెమ్మా బేరం ఎలావుంది? కోటేసేడి?"

"తవరి దయ శెట్టిగారూ!" అదిగో, ఏదో బోగిలోకి ఎక్కుతున్న కొడుకును చూపిస్తూ.

ఆదెమ్మ చూస్తూన్న వైపే చూసాడు సావుకారు. కోటేసు కనబడ్డాడు. సావుకారు వెనక్కు తిరిగి బండి దగ్గరకెళ్తూంటే 'ఛీ!' అని వుమ్మాడు గంగన్న.

"ఒరేయ్ కోటేసూ! సిల్లర లేదని బేరం వదిలేకు! చిల్లర నా దగ్గరుంది!" తన వునికిని తెలియజేసాడు సావుకారు.

ట్రైనులోకి పాసింజర్లు అందరూ ఎక్కారు. సిగ్నలు ఈయబడివుంది. బయలుదేరడానికి సిద్ధంగా వుంది. కంగారుగా ట్రైను దగ్గరికి పరుగెత్తింది ఆదెమ్మ. ఆ వెనుకనే గంగన్న... కోటేసు రెండో బోగిలోకి ఏక్కాడు...

గాబరా పడింది ఆదెమ్మ.

"ఓరే కోటేసు! బండిదిగరా! బండెలిపోద్ది" గట్టిగా కేకేసింది.

తల్లి కేకను లక్ష్యపెట్టలేదు కోటేసు. బండి కదిలింది.

"దిగరా కోటేసు! గట్టిగా అరిచింది తల్లి.

"ఆడే దిగుతాడు లేయే! గాబరా ఎందుకు?" నిధానంగా అన్నాడు గంగన్న. ట్రైన్ మూవ్‌మెంట్‌లో వున్నప్పుడు దిగడంలోనూ, ఎక్కడంలో బాగా అనుభవం వుందని

అతని ధీమా. బండి స్పీడు అందుకొంది. ప్లాట్‌ఫారం దాటింది, వెనుకనే పరుగెత్త సాగింది అదెమ్మ. కొడుకు కడ్డీ పట్టుకొని దిగుతూంటే భయం భయంగా చూసింది. కోటేసు దృష్టి ప్లాట్‌ఫారం మీద పొంచిఉన్న షావుకారి మీది వుంది ఓపక్క.

బండిమీంచి గెంతాడు కోటేసు. ఆ విసురులో బండికింద పడ్డాడు.

"అమ్మా!" అని కేకేసాడు... రెండు తొడలమీద నుంచీ చక్రం పోయింది. కాళ్ళు తెగిపోయాయ్. నెత్తురుమయం. హాహాకారం! గోల! ఏడుపులు!.

కొడుకుమీద పడి బావురుమని ఏడ్చింది తల్లి. కుప్పలా కూలిపోయాడు గంగన్న.

గబగబా పరుగెత్తాడు సావుకారు. కొనవూపిరితో వున్నాడు కోటేసు. శక్తినంతటినీ కూడదీసుకొని ఫాంటు జేబులో చేయిపెట్టి పిడికిల్తో నోట్లను బయటకు లాగి సావుకారికి అందివ్వబోయాడు. ఆ నోట్లు కోటేసు రక్తమాంసాల్లో ముద్దకట్టి పోయాయ్.

సావుకారి మనసు వికలమైంది.

"ఒరేయ్ కోటేసూ! నీ నెత్తురు ముద్ద నాకొద్దురా! నీలాంటి నిజాయితీ పరుడు కావాల్రా!" భోరున యేడ్చాడు సావుకారు. కోటేసు చేయి నేలకి ఒరిగిపోయింది.

గొల్లుమంది అదెమ్మ.

కథా నిలయం
6146
శ్రీకాకుళం

విజయ
డిసెంబర్ 1982